క్లుప్తంగా

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలి

● అన్నెపర్తి జ్ఞాన సుందర్

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిని ఎంపిక చేయడానికి ఏఐసీసీ పరిశీలకుడిగా హాజరైన సారత్ రౌత్‌ను తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సారత్ రౌతుతో ఆయన మాట్లాడారు. తాను ఎన్నో ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. తనను పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తే పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో గెలిపించే దిశగా శ్రమిస్తానని అన్నారు. తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలోని 11 కేవీ ఫీడర్ మరమ్మతులు, వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 09.00 గంటల నుంచి 12.00వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఒకటవ ఏఈ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్నా చర్చ్, బ్రాహ్మణ కల్యాణ మండపం వెనుక, రాజధాని టీ స్టాల్ ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, విద్యానగర్ రామ్మూర్తి హాస్పిటల్ దగ్గర, ఎంఎస్ఆర్ స్కూల్, హాస్పిటల్, గణేష్ చౌరస్తా, బేబీ కేర్ హాస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్లు




మాట్లాడుతున్న నాయకులు

అర్వపల్లి : ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ టి.జలేందర్, రింగు నరహరి, నిమ్మల పాపయ్య, కుంభం నరేష్, సైదుల కిరణ్, వీరయ్య, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

ఆత్మకూర్ (ఎస్) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ నెల 15న మండల పరిధిలోని నెమ్మికల్‌లో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఏఎస్ఎం ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెమ్మికల్ క్రీస్తు రాజ దేవాలయం చర్చ్ ప్రాంగణంలో జరిగే ఈ మేళాలో 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొని వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ధ్యేయంతో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8143539030, 9494349959 నంబర్‌లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

చట్టంపై అవగాహన



సదస్సులో పాల్గొన్న అధికారులు

అర్వపల్లి : సమాచార హక్కు చట్టం-2025పై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ ప్రతినిధి వెంపటి ఆనంద్‌రాము, ఎంపీడీఓ గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు, శిల్పిక, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రామచందర్‌రావు మాతృమూర్తి గోరుగంటి మంగమ్మ(62) మృతి చెందింది. సోమవారం మంగమ్మ మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న, కట్ట మల్లారెడ్డి, ఇరుగు కిరణ్, కనకటి వెంకన్న, గద్దం ప్రశాంత్‌రెడ్డి, నెల్లుట్ల మహేష్, ఎండీ జహంగీర్, బంటు బద్రి పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

అర్వపల్లి: తిమ్మాపురంలోని పీఏసీఎస్‌కు సోమవారం 800బస్తాల యూరియా రాగా రైతులకు పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందిస్తామని, ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఏఓ గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్.సత్యం, పీఏసీఎస్ సీఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

15నుంచి టీకాలు

అర్వపల్లి : మండల వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. టీకాల పంపిణీకి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆసుపత్రిలో ఆవిష్కరించారు.

నిర్మించారు.. వినియోగం మరిచారు

● ప్రారంభానికి నోచుకోని సబ్ మార్కెట్ యార్డు
● రూ.1.55 కోట్లతో నిర్మాణం
● వినియోగంలోకి తేవాలని రైతుల వేడుకోలు





జాజిరెడ్డిగూడెం శివారులో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి సమీపంలో నకిరేకల్–తానంచర్ల 365హైవే వెంట 8ఏళ్ల కిందట నిర్మించిన వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు ఇంతవరకు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ1.55 కోట్లతో మార్కెటింగ్ శాఖ నిధులు వెచ్చించి సబ్ మార్కెట్ యార్డును నిర్మించారు. కానీ ఇంతవరకు ఈ మార్కెట్‌యార్డును ప్రారంభించలేదు. దీనికి తోడు ఈ మార్కెట్‌యార్డును రెగ్యులర్ మార్కెట్‌గా నడిపించుటకు గతంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు కూడా జరిపారు. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఎలాంటి నిర్వహణ లేక యార్డు శిథిలమవుతోంది.

ధాన్యం కొనుగోలు కేంద్రానికే పరిమితం..

ప్రతి పంట సీజన్‌లో ఈ యార్డులో కేవలం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సీజన్ పూర్తి కాగానే కేంద్రాన్ని మూసి వేస్తున్నారు. ఈ యార్డును ధాన్యం కొనుగోలు కేంద్రానికి మాత్రమే వినియోగించడం సరికాదని, యార్డును ప్రారంభించి రెగ్యులర్ మార్కెట్‌గా మార్చాలని రైతులు అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నారు. కానీ ఈ యార్డు ఇంతవరకు రెగ్యులర్ మార్కెట్‌గా కాలేదు. జాజిరెడ్డిగూడెం మండలంతో పాటు శాలిగౌరారం మండలానికి ఆనుకొని ఉన్న ఈ యార్డును ప్రారంభిస్తే రెండు మండలాల రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైనా యార్డును ప్రారంభించి తమ ఇబ్బందులు తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి



మా ఊరిలో కోట్ల రూపాయలు పెట్టి కొన్నేళ్ల కిందట మార్కెట్ యార్డును కట్టించారు. కానీ ఇంతవరకు రైతులకు ఉపయోగపడటం లేదు. ఇక్కడ మార్కెట్ నడిస్తే రైతులకు ఎంతో లాభం. ఈ మార్కెట్‌లో ధాన్యం పోసి 20 రోజులు దాటింది. ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు.

- వల్లాల కోటయ్య, రైతు, జాజిరెడ్డిగూడెం

రెగ్యులర్ మార్కెట్‌గా మార్చాలి



జాజిరెడ్డిగూడెంలో రూ.1.55 కోట్లతో 8ఏళ్ల కిందట వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డును నిర్మించారు. కానీ ఇంతవరకు ప్రారంభించడంలేదు. మార్కెట్ ప్రారంభించడంతో పాటు రెగ్యులర్ మార్కెట్‌గా మార్చాలని జేఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. అధికారులు స్పందించడం లేదు.

- చొల్లేటి రమణ, జేఎస్ఎఫ్ కన్వీనర్

పత్తి రైతు పరేషాన్..

● అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి చేలు
● అంతంత మాత్రంగానే దిగుబడి



అధిక వర్షాలకు ఎర్రబారిన పత్తిచేను

ఆత్మకూర్ (ఎస్) : నాన్ ఆయకట్టు మండలమైన ఆత్మకూరు మండలంలో వరి తర్వాత అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న పంట పత్తి. దాదాపు గత 20 సంవత్సరాలుగా మండలంలోని సారవంతమైన నల్లరేగడి భూముల్లో పత్తిని సాగుచేసిన రైతులు ఆర్థిక లాభాలు పొంది ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పటికీ గత రెండేళ్లుగా పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంట మార్పిడి పాటించకుండా ఒకే భూమిలో అనేక సంవత్సరాలుగా పత్తిని సాగు చేస్తుండడంతో దిగుబడులు తగ్గడంతోపాటు పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకి పెట్టుబడులు పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

5500 ఎకరాల్లో పత్తి సాగు..

ఈ సంవత్సరం ఆత్మకూరు మండలంలో దాదాపు 5500 ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. కాగా పత్తి విత్తనాలు మొలకెత్తే సమయంలో వర్షాలు సక్రమంగా లేకపోవడంతో రైతులు ఒకటికి మూడు సార్లు విత్తనాలు నాటి ఆర్థికంగా నష్టపోయారు. చివరకు పత్తి తీసే సమయంలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల కారణంగా పత్తి తీయడం ఇబ్బంది అవుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఒకటి రెండు సార్లు పత్తి తీయాల్సి ఉండగా ఎక్కడ కూడా పత్తి ఏరిన దాఖలాలు లేవు. దీంతో వర్షానికి తడుస్తున్న పత్తి నల్లగా మారి ధర లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తెగుళ్ల బెడద..

మండలంలో పత్తి సాగు చేసే రైతులు పంట మార్పిడి చేయకపోవడంతో పత్తికి తెగుళ్ల బెడద విపరీతంగా పెరుగుతోంది. గతంలో మూడు దఫాలకు పైగా కాపు వచ్చే పత్తి నేడు ఒకేసారి పూర్తవుతోంది. దీంతో దిగుబడులు తగ్గుతూ రైతులు ఆర్థికంగా నష్టాలకు గురికావాల్సి వస్తోంది.

పంట పూర్తిగా దెబ్బతిన్నది



ఈ సంవత్సరం అధిక వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. పత్తి గింజలు మొలకెత్తే సమయంలో, పూత సమయంలో వర్షాలు లేకపోగా కాపు దశలో అధిక వర్షాలతో కాయలన్నీ రాలిపోయాయి. ప్రస్తుతం పత్తి నల్లబారుతోంది. దిగుబడి పూర్తిగా తగ్గుతోంది.

- బద్దం ధర్మారెడ్డి, ముక్త కొత్తగూడెం

పంట మార్పిడితో మంచి దిగుబడి



మెట్ట పంటల సాగులో రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి పాటించాలి. ఒకే పంట వేయడంతో పంటకు కావలసిన పోషకాలు అందక దిగుబడి తగ్గడంతో పాటు చీడపీడలు వ్యాపిస్తాయి. పంట మార్పిడి చేస్తే దిగుబడి పెరగడంతో పాటు పెట్టుబడి తగ్గుతుంది.

- దివ్య, మండల వ్యవసాయ అధికారి

ఎస్సారెస్పీ ఫేస్–2కు బీఎన్ పేరు పెట్టాలి



మాట్లాడుతున్న కొత్తగట్టు మల్లయ్య



పర్సాయపల్లిలో ఎస్సారెస్పీ కాలువ వద్ద బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తిరుమలగిరి : శ్రీరాంసాగర్ జలాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మాజీ పార్లమెంట్ సభ్యుడు భీమ్ రెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్ రెడ్డి) పేరును ఎస్సారెస్పీ ఫేస్–2కు పెట్టాలని సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలగిరిలో నిర్వహించిన అఖిలపక్షం నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎస్సారెస్పీ ద్వారా నీళ్లు తేవడమే తన జీవిత ఆశయంగా బీఎన్ రెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బీఎన్ రెడ్డి పేరు పెట్టడం ఆయనకే కాకుండా ఈ ప్రాంతానికి సముచిత గౌరవంగా భావిస్తామని అన్నారు. నిన్న తుంగతుర్తిలో జరిగిన సంస్మరణ సభలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదరరెడ్డి పేరు ప్రకటించడం తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. మరోసారి సీఎం రేవంత్ రెడ్డి పునః సమీక్షించి బీఎన్ రెడ్డి పేరు పెట్టే విధంగా పునరాలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి ఎల్లంల యాదగిరి, ఊడ్గుల ప్రభాకర్, చేను శ్రీనివాస్, నలుగూరి రమేష్, దుస్సా రామ్మూర్తి, వనం సోమన్న, చింతకింది సోమనారాయణ, కందుకూరి ప్రవీణ్, ఎండీ ఖాసీమ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండో దశకు మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని కోరుతూ సోమవారం మండల పరిధిలోని పర్సాయపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, కుమార్, శిగ వెంకన్న, డి.వెంకన్న, కె.విజయ్, అబ్బులు, నరేందర్, వీరస్వామి, వెంకటేష్, భిక్షం, వీరయ్య, అవిలయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలి

భానుపురి : 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు ఇప్పటివరకు పట్టాలు లేవని, వీటికి హక్కు పత్రాలు కల్పించి ఆదుకోవాలని కోరుతూ జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 333, 334, 336, 338లో తమ తాతల నుంచి వచ్చిన 30ఎకరాల భూమిని 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ భూమికి పట్టాలు పొందేందుకు అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. హక్కుపత్రాలు లేకపోవడంతో రుణాలు అందడం లేదని, పంటల అమ్మకానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జీడి సైదులు, పూలమ్మ, జీడి మల్లయ్య, నాగరాజు, రాజయ్య, చెరుకుపల్లి శ్రీరాములు, చెరుకుపల్లి వసంత, గురువయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

భానుపురి : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సూర్యాపేట ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఏపూరి రాజు, విజయరావు, కోటేష్, ఆంజనేయులు, మల్లయ్య, రామాంజీ, చంద్రయ్య, వెంకన్న, సూరి, మౌలానా, విజయ్, సునీల్, సోమయ్య, రంజిత్, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఉద్యమవీరుల ఆశయసాధనకు కృషి చేయాలి



జెండా ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

నాగారం : విద్యార్థుల సమస్యలపై పోరాడి ప్రాణాలర్పించిన విద్యార్థి ఉద్యమవీరులు యానాల నేపాల్‌రెడ్డి, దిండిగల్ లింగయ్యల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం డి.కొత్తపల్లి స్టేజీ వద్ద నేపాల్‌రెడ్డి, లింగయ్యల 45వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి, స్మారక స్థూపాల వద్ద జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, న్యూడెమోక్రసీ నాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, బయ్యం లింగయ్య, ఎస్‌డీ బడేమియా, దందోలు ధనంజయ్, కాసం వీరయ్య, పల్లెర్ల సోమయ్య, రింగు శేఖర్, నాతి ఉప్పలయ్య, గాడిదల శ్రీను, పడిశాల సంజీవ, మర్రిపల్లి సతీష్, నాతి ఉప్పలయ్య, భూషబోయిన రమేష్, వీరాచారి, వేముల గణేష్, లింగస్వామి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ ద్వారా బతికించవచ్చు

అర్వపల్లి: గుండెపోటుకు గురైన వారిని సీపీఆర్ ద్వారా బతికించవచ్చని మండల వైద్యాధికారి భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ అధికారులు సునీత, కళమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



తుంగతుర్తి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



అర్వపల్లి : కమ్యూనిటీ హాల్‌కు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2389, బీ గ్రేడ్ రకానికి రూ.2369 ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నారం గ్రామంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సొసైటీ వైస్ చైర్మన్ మోదం శ్రీలత, సొసైటీ సీఈఓ యాదగిరి, ఏఈఓలు జోత్స్న, సాయి శ్రీ జన, ఏపీఎం అశోక్, డైరెక్టర్లు, కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, యాదగిరి, ఈదప్ప, మాజీద్, కాకులారపు భిక్షం రెడ్డి, రేగటి పూలమ్మ, పులుగుజ్జ యాకయ్య, యనగందుల రామచంద్రు, పెండెం యాదగిరి, రామ నర్సమ్మ, మాచర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి రూ.2389 మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, ఎల్లు అశోక్ రెడ్డి, వలపు రమేష్, చామకూరు శ్రీనివాస్, దండంపెల్లి ఉమేష్, జక్కి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1800కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

అర్వపల్లి : గతంలో ఎవరూ చేపట్టని విధంగా తాను రూ.1800 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. కొమ్మాలలో సోమవారం రూ.50 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, వేల్పుల రమేష్, మందడి పూర్ణచంద్రారెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతనకల్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, పాల్వాయి నాగరాజు, పసుల అశోక్ యాదవ్, గుగులోతు కృష్ణ, ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం.. అన్నదాతకు తప్పని కష్టం



తుంగతుర్తిలో ఆరబెట్టిన ధాన్యం



వర్షాలకు అర్వపల్లి శివారులో నేలకొరిగిన వరి పొలాలు

తిరుమలగిరి : మండల పరిధి వివిధ గ్రామాలలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల పరిధిలోని తొండ గ్రామంలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోశారు. చేలల్లో వరి పంట నేలకు ఒరిగింది. పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అర్వపల్లి : సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షంతో వరి పంటలకు నష్టం వాటిల్లింది. వరి పొలాలు నేలకొరిగాయి. అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి, కుంచమర్తి, రామన్నగూడెం తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కొంతధాన్యం నీళ్లలో కొట్టుకపోయింది. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

తుంగతుర్తి : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసింది. వరిచేలు నేలకు ఒరిగాయి. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని రైతులు కోరుతున్నారు.



అర్వపల్లిలోని కేంద్రంలో తడిసిన ధాన్యం



తిరుమలగిరి : వెలిశాలలో ఆరబోసిన ధాన్యం



తిరుమలగిరి : తొండలో రోడ్లపై చేరిన వరద

ఐదేళ్లుగా.. అసంపూర్తిగా..



అసంపూర్తిగా నిలిచిన దవాఖాన నిర్మాణం

అర్వపల్లి : కొమ్మాల గ్రామంలో పల్లె దవాఖాన నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పల్లె దవాఖానకు సొంత భవన నిర్మాణం కోసం రూ.7లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవన నిర్మాణం జరిగినా ఇంకా చిన్నచిన్న పనులు ఆగిపోయాయి. మంజూరైన నిధుల వరకు భవన నిర్మాణం చేపట్టారు. అదనంగా మరికొన్ని నిధులు మంజూరైతేనే ఈ భవనం పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్దె భవనంలో ఆసుపత్రిని నడిపిస్తున్నారు. అదనపు నిధులను మంజూరు చేసి, పనులను పూర్తి చేయాలని, భవనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్స్ అందజేయాలి



కోదాడలో రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

కోదాడ : ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే అందజేయాలని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో జరిగిన ఆ సంఘం కోదాడ డివిజన్ నాయకుల సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వ రంగ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా ప్రభుత్వం సౌకర్యాలను కల్పించాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, సంఘ నాయకులు రాపర్తి రామనర్సయ్య, పానుగోటి కోటయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మౌలానా, ముత్తవరపు రామారావు, ఉమామహేశ్వరావు, జేఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.